తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక



హైదరాబాద్ ఆదివారం 05 - 07 - 2026 ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి పేజీలు : 5

# ఉపాధి హామీ పనుల్లో అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు

- విధుల పట్ల అలసత్వం వహించిన సిబ్బందికి రూ.6669 జరిమానా
- మోత్కూర్ లో 16వ విడత సామాజిక తనిఖీ ఓపెన్ ఫోరం

## మండల స్పెషల్ ఆఫీసర్, డీఆర్డీవో సురేష్



ప్రజావారధి/మోత్కూరు

ఉపాధి హామీ పనుల అమలులో అవినీతికి పాల్పడిన నిర్లక్ష్యం వహించిన కఠిన చర్యలు తప్పవని డీఆర్డీవో జి.సురేష్ హెచ్చరించారు. మోత్కూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం 16వ విడత ఉపాధి హామీ సామాజిక తనిఖీ ఓపెన్ ఫోరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల కల్పనలో జిల్లాలో మోత్కూర్ మండలం ముందంజలో ఉందన్నారు. పలు అంశాల్లో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు మరింత బాధ్యతతో పని చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. రికార్డుల నిర్వహణలో సంవత్సరంతో పోలిస్తే ప్రస్తుతం మెరుగ్గా ఉందన్నారు. కొత్త జాబ్ కార్డుల జారీకి ఎలాంటి టెక్నికల్ సమస్యలు లేవని, ఉపాధి హామీ పనులకు వచ్చే ప్రతి అర్హులైన కార్మికుడు తప్పనిసరిగా జాబ్ కార్డు పొందాలన్నారు. ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం వహించిన పంచాయతీరాజ్ ఏఈకి రూ.614, టెక్నికల్ అసిస్టెంట్లకు రూ.213, పంచాయతీ కార్యదర్శులకు రూ.4,730, కంప్యూటర్ ఆపరేటర్‌కు రూ.500, ఎఫ్ఏలకు రూ.612 చొప్పున మొత్తం రూ.6669 జరిమానా విధించినట్లు తెలిపారు. ప్రస్తుతం వానాకాలంలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మండలంలో 35 వేల మొక్కలు నాటాలన్న లక్ష్యాన్ని పూర్తి చేయాలని చెప్పారు. అనంతరం 01-04-2025 నుండి 31-03-2026 వరకు ఉపాధి హామీ పథకం, పంచాయతీరాజ్, స్వయం సహాయక సంఘాలు, మన ఊరు-మనబడి పథకాల కింద ఖర్చు చేసిన నిధులపై 19-06-2026 నుండి 03-07-2026 వరకు మండలంలోని గ్రామాల్లో సామాజిక తనిఖీలు నిర్వహించగా డీఆర్పీలు నివేదికలు చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ విజిలెన్స్ ఆఫీసర్ మందాడి ఉపేందర్ రెడ్డి, ఎస్టీఎం తిరుపతన్న, విజిలెన్స్ మేనేజర్ ఆదిత్య, జేసీక్యూవో ఫసియుద్దీన్, ఎంపీడీవో బాలాజీ, ఎంపీఓ రవూఫ్ అలీ, ఎస్ఆర్పీలు అశోక్, వెంకన్న, ఏపీవో కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ
ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక
ఆదివారం



# గురుకుల పాఠశాలల్లో మౌళిక సదుపాయాలు కల్పించాలి

ప్రజావారధి/మోత్కూరు

సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో సమస్యలను వెంటనే పరిష్కరించి, మౌళిక సదుపాయాలు కల్పించాలని స్కోప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ జిల్లా కోఆర్డినేటర్ వి.సోమ నర్సయ్య కోరారు. శనివారం మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల ఆవరణంలో స్కోప్ స్వచ్ఛంద సంస్థ, యూనిసెఫ్ సహకారంతో మహిత లయన్స్ ఫర్ చైల్డ్ రైట్స్ ఆధ్వర్యంలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరుగుదొడ్లు, మూత్రశాలలు ఏర్పాటు చేయాలని, విద్యార్థులకు మెనూ



ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలన్నారు. బాల్య వివాహాల నివారణ, డ్రాపవుట్ పై దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్కోప్ సంస్థ మండల కోఆర్డినేటర్ కురిమేటి యాదయ్య, సంస్థ సభ్యులు వెంకటేష్, అశ్విని, నర్సింహరాజు తదితరులు పాల్గొన్నారు.

# గురుకులాల్లో ఇంటర్ స్పాట్ కౌన్సిలింగ్

ప్రజావారధి/మోత్కూరు



పదవ తరగతి పాసైన విద్యార్థులకు ఈ నెల 6న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ స్పాట్ అడ్మిషన్ల కోసం కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు మోత్కూరు సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.స్వామి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గురుకులాల్లో చేరే విద్యార్థులు కుల, ఆదాయ సర్టిఫికెట్లు, టీసీ, బోనో ఫైడ్ ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో పాటు పదవ తరగతి ఉత్తీర్ణత పొందిన ఆన్‌లైన్ మెమోతో వలిగొండ (బాలుర), బీబీనగర్ (బాలికల) గురుకుల స్కూళ్లలో 6న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు హాజరు కావాలన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# రైతులకు వరి విత్తనాల పంపిణీ



ప్రజావారధి/మోత్కూరు

రాజేందర్‌నగర్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు నిర్ధారించిన కేఎన్ఎం-1638 సన్న రకం వరి విత్తనాలను రైతులు సాగు చేయాలని మోత్కూరు సింగిల్‌విండో చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు కోరారు. శనివారం మోత్కూరు సింగిల్‌విండో కార్యాలయంలో రైతులకు కేఎన్ఎం సన్నరకం వరి విత్తనాలను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వి.కీర్తి, రైతులు దెందే యాదగిరి, కప్పే మల్లేశం, శ్రీనివాసరెడ్డి, సంఘం సీఈవో కె.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ మండల అధ్యక్షుని నియామకం రద్దు చేయాలి

- కార్యకర్తల ఏకాభిప్రాయంతో కొత్త అధ్యక్షున్ని నియమించాలి
- ముశిపట్ల మాజీ సర్పంచ్ తండ సత్తయ్య
- మున్సిపల్ కౌన్సిలర్ కారుపోతుల వెంకన్న



ప్రజావారధి/మోత్కూరు

కాంగ్రెస్ మోత్కూర్ మండల అధ్యక్షుని నియామకాన్ని వెంటనే రద్దు చేసి, పార్టీ ముఖ్య నాయకులు, గ్రామశాఖ అధ్యక్షులు, మండల నాయకులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తల ఏకాభిప్రాయంతో కొత్త అధ్యక్షున్ని నియమించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ముశిపట్ల మాజీ సర్పంచ్ తండ సత్తయ్య గౌడ్, మోత్కూరు మున్సిపల్ కౌన్సిలర్ కారుపోతుల వెంకన్న కోరారు. శనివారం మోత్కూర్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ ఏకపక్ష నిర్ణయంతో నూతన అధ్యక్షున్ని ప్రకటించారన్నారు. సమావేశం నిర్వహించి కేడర్ అభిప్రాయాలను తెలుసుకోకుండా, స్థానిక నాయకులతో సంప్రదింపులు జరపకుండానే ఎమ్మెల్యే ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని, కార్యకర్తల మనోభావాలకు విరుద్ధంగా ప్రకటించిన అధ్యక్షుని నియామకం రద్దు చేయాలన్నారు. తాను రెండు పర్యాయాలు ముషిపట్ల గ్రామ సర్పంచ్‌గా పనిచేశానని, గత 35 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ కోసం నిరంతరం కష్టపడుతూ పార్టీ బలోపేతానికి సేవలందిస్తున్న సీనియర్ నాయకుడినని తండ సత్తయ్య తెలిపారు. తనలాంటి సీనియర్ నాయకులను పక్కనపెట్టి సంప్రదింపులు లేకుండా నియామకాలు చేపట్టడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మండల అధ్యక్షుడి ఎంపికలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, నియోజకవర్గ ఇన్‌చార్జి గుడిపాటి నర్సయ్యతో పాటు ఇతర ముఖ్య నాయకులు, గ్రామశాఖ అధ్యక్షులు, మండల నాయకులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను తీసుకున్న తర్వాతే మండల అధ్యక్షున్ని నియమించాలని డిమాండ్ చేశారు. పార్టీని నమ్ముకుని పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలు పదేళ్లు ఎన్నో కష్టనష్టాలకోర్చి పనిచేస్తే పార్టీ అధికారంలోకి వచ్చిందని, ఎవరి స్వార్థం కోసమో పార్టీని బలి చేయవద్దని కోరారు. పార్టీ రాష్ట్ర, జిల్లా అధిష్ఠానం చొరవ తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు మెంట రమణనగేష్, కుర్మిళ్ల ప్రమీలరాములు, మార్కెట్ డైరెక్టర్ ఎండి.సమీరుద్దీన్, పనకబండ మాజీ సర్పంచ్ సుదగాని పాండు, జినుకల కనకయ్య, మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బుషిపాక రమేష్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎర్రానిపల్లి సందీప్, ఉపాధ్యక్షుడు అవిశెట్టి కిరణ్, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు నిమ్మల శ్రీను, ముషిపట్ల గ్రామ అధ్యక్షుడు కొల్లు రమేష్, ఎండి.షాకిరుద్దీన్, బుషిపాక నరేష్, బీసు రాహుల్, కొల్లూరి యాదగిరి, కేమిడి రాములు, బుశిపాక పరుశురాములు, బుషిపక సైదులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక
05 - 07 - 2026

# ముగిసిన చేనేత సహకార ఎన్నికల నామినేషన్లు



ప్రజావారధి/మోత్కూరు

మోత్కూరు చేనేత సహకార ఎన్నికల నామినేషన్ ప్రక్రియ శనివారంతో ముగిసింది. సహకార సంఘంలో 9 డైరెక్టర్ స్థానాల్లో 7 జనరల్ రిజర్వ్ కాగా, రెండు మహిళలకు రిజర్వ్ అయ్యాయి. 7 జనరల్ స్థానాలకు 18 మంది, రెండు మహిళా డైరెక్టర్ స్థానాలకు ఆరుగురు నామినేషన్లు దాఖలు చేశారని ఎన్నికల అధికారి సయ్యద్ సుజాత్ అలీ తెలిపారు. 9 డైరెక్టర్ స్థానాలకు మొత్తం 24 నామినేషన్లు వచ్చాయన్నారు. 5న నామినేషన్లు పరిశీలన, 6న స్క్రూటినీ, విత్ డ్రా, 10న ఓటింగ్ ఉంటుందని తెలిపారు.

# సర్‌తో ఓటర్లు అప్రమత్తంగా ఉండాలి



ప్రజావారధి/మోత్కూరు

ఓటరు జాబితాల సవరణ కోసం ఎన్నికల సంఘం చేపట్టిన సర్ కార్యక్రమంతో ఓటర్లు అప్రమత్తంగా ఉండాలని బీఎల్ఏల ఇన్‌చార్జి, మోత్కూరు మున్సిపల్ కౌన్సిలర్ కారుపోతుల వెంకన్న, కాంగ్రెస్ మండల ప్రధానకార్యదర్శి జినుకల కనకయ్య కోరారు. సర్ కార్యక్రమంలో భాగంగా శనివారం మోత్కూరు మున్సిపాలిటీలోని 6, 9, 10వ బూత్‌లల్లో ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫాంలు అందజేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటర్లకు అందజేస్తున్న ఫాంలల్లో ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్తగా తమ వివరాలు నమోదు చేయాలని, ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా, తప్పుగా ఫాం నింపినా తమ ఓట్లు రద్దయ్యే ప్రమాదముందన్నారు. ఎన్యూమరేషన్ ఫాంలు పూర్తి చేయడంలో ఓటర్లు ఎలాంటి అనుమానం ఉన్నా బీఎల్ఏలు, బీఎల్‌వోల సహకారం తీసుకోవాలని కోరారు. ఈ



కార్యక్రమంలో కాంగ్రెస్ మున్సిపాలిటీ అధ్యక్షురాలు, 6వ బూత్ బీఎల్ఏ అన్నెపు పద్మ, 9వ బూత్ బీఎల్ఏ అవిశెట్టి కిరణ్‌కుమార్, నాయకుడు అవిశెట్టి మధు, బీఎల్‌వోలు వర్రె నరేందర్, బీసు శాంతికుమార్, బీసు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక
05 - 07 - 2026

## సమిష్టి కృషితో..

# ప్రభుత్వ కాలేజీని మరింత బలోపేతం చేయాలి



**ప్రజావారధి/మోత్కూరు**

ఉత్తమమైన విద్యా బోధనతో సమిష్టిగా కృషిచేసి కళాశాలను మరింత బలోపేతం చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి బి.సురేష్ రెడ్డి కోరారు. మోత్కూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ప్రిన్సిపాల్ ఆర్.రవీందర్ అధ్యక్షతన లెక్చరర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత విద్యా సంవత్సరంలో మెరుగైన ఫలితాలు సాధించి రాష్ట్రస్థాయిలో 9వ స్థానంలో నిలిచేందుకు కృషిచేసిన లెక్చరర్లను అభినందించారు. ఈ విద్యా సంవత్సరంలో మరింత సమిష్టి కృషితో ఉత్తమమైన బోధనను అందించి కళాశాల నుండి వెళ్లిన ప్రతి విద్యార్థి తనదైన గుర్తింపు తెచ్చుకునేలా లెక్చరర్లు కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ కళాశాలలో చేరే విద్యార్థుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపడుతుందని, విద్యార్థుల తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను ప్రభుత్వ కళాశాలలో చేర్పించి ఆ ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల సంఖ్యపై ఆరా తీసి ప్రస్తుతం కళాశాలలో చేరిన ప్రతి విద్యార్థిని కళాశాల అంబాసిడర్ గా తీర్చిదిద్దాలని కోరారు.